క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యకర గ్రామాలు



చింతపల్లిలో డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కృషి చేయాలని ఈఓపీఆర్డీ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. చింతపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ కొల్లు లోవ కుమారి అధ్యక్షతన తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తలను వేరు చేస్తూ, పారిశుధ్య చర్యలను మెరుగుపరిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఆర్.చైతన్య సాగర్, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, నాయకులు కొల్లు సత్తిబాబు, పైన వీర వెంకట సత్యనారాయణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

స్వీట్ బాక్సుల వితరణ



తొస్సిపూడిలో స్వీట్ బాక్సులు అందిస్తున్న కొవ్వూరి వెంకటరెడ్డి

బిక్కవోలు: నందిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొస్సిపూడి గ్రామంలోని సుమారు 1300 కుటుంబాలకు గురువారం స్వీట్ బాక్సులు, కేలండర్లు పంపిణీ చేశారు. ఆ ట్రస్ట్ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి పుట్టిన సందర్భంగా, సంకాంత్రిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. సర్పంచి కొవ్వూరి సీతారత్నం, డాక్టర్ కె.నందినీ దేవి, ట్రస్ట్ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న సర్పంచ్ వెంకట రమణ

బిక్కవోలు: కాపవరం గ్రామంలోని పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి గురువారం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ దుస్తులు అందించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ వితరణ చేశారు.

సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఉప్పులేటి దేవీ ప్రసాద్

రాజానగరం: మాలల హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాటం చేయాలని అఖిల భారత మాలల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీ ప్రసాద్, మాజీ సివిల్ సర్వీస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మేకల లక్ష్మీపతి రావు ఆధ్వర్యంలో స్థానిక జగనన్న కాలనీలో గురువారం మండల స్థాయి మాలల ఐక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘాల జాతీయ నాయకులు తుమ్మల తాతారావు, కొల్లం రత్నం, గుర్రం రామారావు, కోణాల లాజరు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ



చీర, సారెతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

పెదపూడి: సంపర గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గోదాదేవి అమ్మవారికి గురువారం మహిళలు సారె, చీర సమర్పించారు. ధనుర్మాసంలో 26వ రోజు సందర్భంగా అమ్మవారికి చీర, సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామంలోని మహిళలందరూ సారెతో ముందుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

దయనీయం.. దర్జీల జీవనం

- రెడీమేడ్ వస్త్రాల హవా
- తగ్గిపోయిన పనులు
- అరకొర ఆదాయంతో అవస్థలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 వేల సాయం
- నేడు రూపాయి కూడా ఇవ్వని కూటమి





దుస్తులు కుడుతున్న టైలర్లు

బిక్కవోలు: ఒకప్పుడు తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి వస్తుందంటే చాలు టైలర్లు రేయింబవళ్లు దుకాణాల్లో ఉండిపోయి దుస్తులు కుడుతూ బిజీగా కనిపించేవారు. చేతినిండా పని ఉండడంతో కడుపు నిండా తినేందుకు ఏ ఇబ్బందీ ఉండేది కాదు. ఆర్థికంగా భరోసా లభించేది. అయితే కొన్నేళ్లుగా రెడీమేడ్ వస్త్ర దుకాణాల ప్రభావంతో దర్జీల జీవనమే మారిపోయింది. అందరూ రెడీమేడ్ వస్త్రాలే కొనుగోలు చేయడంతో వీరికి పూర్తిస్థాయిలో పని లేకుండా పోయింది. ఫలితంగా పండగ వేళ కూడా ఆశించిన ఆదాయం రావడం లేదు. వస్తున్న అరకొర డబ్బులతో బతుకు భారంగా మారుతోంది.

రెడీమేడ్ వస్త్రాల హవా

ప్రస్తుతం ఎక్కడ చూసినా రెడీమేడ్ వస్త్రాలే కనిపిస్తున్నాయి. ఎక్కువగా సీనియర్ సిటిజన్లు మాత్రమే దుస్తులను కుట్టించుకుంటున్నారు. అలాగే పెళ్లిళ్లకు సంబంధించిన వస్త్రాల పనులు మాత్రమే దొరుకుతున్నాయి. సఫారీలు, సూట్ల కోసం కూడా కొందరు టైలర్లను ఆశ్రయిస్తున్నారు. అంతకు మించి పని దొరకడం లేదు. 1990లో రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్ల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని చెప్పవచ్చు. అందుబాటు ధరలకే ప్యాంట్లు, షర్టులు, టీషర్టులను షాపుల్లో విక్రయించడంతో యువకులందరూ అటు వైపే మొగ్గు చూపారు.

పని లేక..

రెడీమేడ్ వస్త్రాలు వచ్చినప్పటి నుంచి దర్జీలకు పని తగ్గిపోయింది. ప్రస్తుతం రెడీమేడ్ ప్యాంట్లను సైజ్ చేయడం, ప్యాచ్ వర్కుల పని మాత్రమే ఉంటోంది. ప్రస్తుతం టైలరింగ్ దుకాణాల్లో జత కుట్టేందుకు రూ.600 పైగా వసూలు చేస్తున్నారు. ఆ ధరకే రెడీమేడ్ దుకాణంలో షర్టు, ప్యాంటు వస్తున్నాయని యువకులు చెబుతున్నారు.

తగ్గిన సంపాదన

టైలర్లు రోజంతా పని చేసినా వస్తున్న సంపాదన కుటుంబ అవసరాలకు కూడా సరిపోవడం లేదు. రోజుకి కనీసం రూ.వెయ్యి కూడా రావడం లేదు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె, కుటుంబ పోషణకు అధిక మొత్తంలో ఖర్చవుతోంది. అయితే వివాహాల సీజన్‌లో మాత్రం కాస్త మెరుగైన రీతిలో బేరాలు ఉంటాయి. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకం కింద ఏడాదికి అందించిన రూ.10 వేలు కొంత అవసరాలకు ఉపయోగపడేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వారికి ఏమాత్రం భరోసా లభించడం లేదు. రెడీమేడ్ వస్త్రాల దెబ్బకు ఎందరో టైలర్లు కుదేలయ్యారు. చాలామంది ఉపాధి కరువై షాపింగ్ మాల్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 2 వేల మంది టైలర్లు ఉన్నారు.

కష్టంగా మారిన కుటుంబ పోషణ

రెడీమేడ్ వస్త్రాల రాకతో బేరాలు బాగా తగ్గిపోయాయి. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. చాలామంది మంది మాత్రమే క్లాత్‌లు తీసుకుని దుస్తులు కుట్టించుకుంటున్నారు.
– కొశెట్టి త్రివేణి, టైలర్, ఊలపల్లి

రూ.10 వేల సాయం పోయింది

గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్లకు ఏటా రూ.10 వేలు చొప్పున చేయూత పథకం కింద అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఆర్థిక సాయం అందించడం లేదు. ఒక వైపు బేరాలు లేక మరోవైపు రూ.10 వేలు రాక టైలర్ల పరిస్థితి దారుణంగా మారింది.
– కొమరపు శ్యాంబాబు, టైలర్, రంగాపురం

ప్రత్యేక బోధనపై శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'బహుళ వైకల్యాలున్న పిల్లలకు కమ్యూనికేషన్ సవాళ్లు, వృద్ధికరమైన ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్' అనే అంశంపై మూడు రోజులుపాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (కాకినాడ – రాయుడుపాకలు) సహకారంతో క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక విద్యను బోధించే ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సొసైటీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జక్కంపూడి రాజా పరామర్శ



చినకొండేపూడిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం/మధురపూడి: కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. కాపవరం, శ్రీరంగపట్నం, బొల్లెద్దుపాలెం, రాపాక, వంగలపూడిలో పలువురు మృతుల కుటుంబాలను ఓదార్చారు. అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్రీరంగపట్నం, చినకొండేపూడికి చెందిన పలువురిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొంచ అన్నపూర్ణ, కొంచ భాస్కరరావు, చెరుకూరి శ్రీనివాస్, పోలినాటి ఈశ్వరుడు, ముదునూరి రామకృష్ణంరాజు, ముదునూరి ప్రసాదరాజు, మురార్జీ, పిచ్చుకల విజయ్ కుమార్, పిచ్చుకుల రవికుమార్, రావూరి రామరాజు ఉన్నారు.

అబ్బురపరచిన ఆలయ నృత్యం



ఆలయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక, సాహిత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆగమ శాస్త్ర విధానంలో ఇచ్చిన ఆలయ నృత్యం అబ్బురపరిచింది. డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో దివ్యశ్రీ, చంద్రకళ, భువన, నవ్యశ్రీ, లక్ష్మి, సుందరి, రిషి హాసిని, నయనిక, భాను దుర్గ, అశ్రిత అద్భుతంగా నర్తించారు. వారిని జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు అభినందించి, సత్కరించారు.

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

మధురపూడి: పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ సెలవులను ప్రకటించారని కోరుకొండ విద్యాశాఖాధికారి టి.కుశల వదొర తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 84 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సుమారు 11,944 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి వేళాయె..



పందలపాకలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి



బలభద్రపురంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం

బిక్కవోలు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వీటి ద్వారా స్వామివారిని భక్తులు దర్శనం చేసుకోవచ్చు. అనపర్తిలో వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి, బిక్కవోలు లక్ష్మీనారాయణ స్వామి, ఊలపల్లి వేణుగోపాలస్వామి, పందలపాక వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి, బలభద్రపురం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొమరిపాలెం, తొస్సిపూడి, ఆరికరేవుల, కొంకుదురు గ్రామాల్లో దేవాలయాలను ముస్తాబు చేశారు. పెదపూడిలోని జనార్దనస్వామి, దోమాడ, కరకుదురులో వేణుగోపాలస్వామి, జి.మామిడాడ, పెదపూడిలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు జరగనున్నాయి. వడిశలేరు భజేనారాయణస్వామి, కోటపాడు వేణుగోపాలస్వామి, రంగంపేట వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పూజలకు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు సన్మానం



జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: తెలుగు భాష విశిష్టతను, ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా ఏటా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇటువంటి కార్యక్రమాల వలన భాషాభివృద్ధితో పాటు మాతృభాష గురించి నేటి తరానికి అవగాహన కలుగుతుందన్నారు. జీజీయూలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో గురువారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాను నిర్వాహకులు, జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు సత్కరించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రంగంపేట హైస్కూల్లో సంప్రదాయ దుస్తులు ధరించిన బాలికలు



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజేతలకు బహుమతుల ప్రదానం

రంగంపేట: సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగడానికి కృషి చేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఆ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని, ఆటపాటలతో ఆనందంగా గడపడం బాల్యం నుంచి అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. జస్వంత్ అనే విద్యార్థి హరిదాసు వేషధారణ ఆకట్టుకుంది.

అంబరాన్ని తాకిన వేడుకలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వివిధ పోటీలు జరిపి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

- బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పోలిన కృష్ణ భోగి మంటలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



బొబ్బిల్లంక జెడ్పీ హైస్కూల్లో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

జగన్‌ను కలిసిన సుబ్బిరెడ్డి



మాజీ సీఎం జగన్‌తో సత్తి సుబ్బిరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి నివాసంలో గురువారం అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన న్యాయవాది, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో పేదలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు.

టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

మధురపూడి: తిరుపతిలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం, పలువురు క్షతగాత్రులైన సంఘటనకు బాధ్యత వహిస్తూ టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడు రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనా ఉన్నా ముందస్తు చర్యలు చేపట్టకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. కౌంటర్లు పెంచినప్పటికీ భక్తుల సౌకర్యార్థం ముందస్తు జాగ్రత్తలు చేపట్టలేదన్నారు. ప్రమాద సంఘటనలో క్షతగాత్రులకు హుటాహుటీన వైద్యసేవలు అందించడంలో అలస్యం జరిగిందన్నారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలన్నారు. బోర్డు చైర్మన్, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

సీతానగరం: ఉద్యానశాఖ, పెద్దాపురానికి చెందిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం సీతానగరంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఉద్యానవనశాఖ అధికారి పి.రిని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ప్రకాష్ మాట్లాడుతూ పతంజలి కంపెనీ మొక్కలను ఉచితంగా ఇస్తున్నారని, ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. టెక్నికల్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఆఫీసర్ కె.కార్తిక్, డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువులు, నీటి యాజమాన్యం, చీడపీడల నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో ఎల్.సౌమిత్రి, క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.నాగేశ్వరరావు, సిబ్బంది పి శ్రీనివాస్, వీరబాబు, రైతు వలవల వెంకట్రాజు (తోటలో రాజు) తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



ఇలపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రారంభోత్సవాలు చేశారు. ఇలపల్లి, ఊలపల్లి, పందలపాల గ్రామాలలో సీసీ రోడ్లు, ఊలపల్లిలో కమ్యూనిటీ హాలు, రైతు సేవాకేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్



నిందితుడికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రామ్ కుమార్

సీతానగరం: రాజంపేటలో గత నెల 31 రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గుళ్లకు చెందిన ఇండుగుమిల్లి సిద్ధూను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపారు. సీతానగరం పోలీస్ స్టేషన్‌లో అతడికి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం రాజమహేంద్రవరం 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చామన్నారు.

నర్సరీ సందర్శన



శివాంజనేయ నర్సరీలో అరోమాసింగ్ ఠాకూర్ తదితరులు

కడియం: కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని గురువారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్కను అందించి వారికి ఘనంగా స్వాగతం పలికారు.